ఒడిశా టు ధూల్‌పేట్


సీజ్ చేసిన కారు, గంజాయిని చూపిస్తున్న పోలీసులు

గంజాయి ముఠా అరెస్టు

మలక్‌పేట: గంజాయి రవాణా చేస్తున్న పాత నేరస్తుల ముఠాను మలక్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ స్వామి, మలక్‌పేట ఏసీపీ శ్యామ్‌సుందర్, ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన ఇక్కిరి భాస్కర్(27), వల్లం దాసు వంశీ(25), జిట్ట కిరణ్(22), బోయిని వంశీ(28), మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం, వెంకంపల్లి గ్రామానికి చెందిన అలభరత్‌కుమార్‌రెడ్డి(32) వీరంతా గంజాయి కేసుల్లో జనగామ జైల్లో వీరి మధ్య పరిచయం ఏర్పడింది. జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత ముఠాగా ఏర్పడి గంజాయి విక్రయించడానికి పథకం పన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం గడ్డిఅన్నారం చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా 30 కిలోల గంజాయితో పట్టుబడ్డారు. ఒడిశా సరిహద్దు నుంచి గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి నగరంలోని ధూల్‌పేటలో విక్రయిస్తుంటారు. నూతన సంవత్సరం రానున్న నేపథ్యంలో ఎక్కువ ధరకు విక్రయించడానికి వచ్చినట్లు నిర్ధారించారు. ఈ ముఠాపై వివిధ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కామినేనిలో అరుదైన శస్త్ర చికిత్స

హెల్మెట్ థెరపీతో చిన్నారికి ప్రాణం


శస్త్ర చికిత్స అనంతరం హెల్మెట్ థెరపీతో చిన్నారి

మన్సూరాబాద్: జన్యుపరమైన కారణాలతో మాడు మూసుకుపోయిన చిన్నారికి ఎండోస్కోపి సూచరెక్టమీ, హెల్మెట్ థెరపీతో ఎల్‌బీనగర్ కామినేని వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి చిన్నారికి ప్రాణం పోశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రమేష్ వివరాలు వెల్లడించారు. వరంగల్‌కు చెందిన ఓ దంపతులకు జన్మించిన శిశువు మూడు నెలల వయస్సులో ఉండగా ఖాళీగా ఉండాల్సిన మాడు ప్రాంతంలో గట్టిగా ఉండటంతో స్థానిక వైద్యుల సూచనల మేరకు కామినేని ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్య బృందం కపాలం పెరగడాన్ని గుర్తించి అందుకు తగిన శస్త్రచికిత్స నిర్ధారించి చేయాలని అరుదైన ఎండోస్కోపిక్ విధానంలో సూచరెక్టమీ అనే శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామన్నారు. మూసుకుపోయిన మాడు ప్రాంతాన్ని మళ్లీ తెరచి, మెదడు తగినంత ఎదిగేందుకు కావాల్సిన సౌకర్యాన్ని కల్పించామని స్పష్టంచేశారు. జన్యుపరమైన కారణాలతో ఇలాంటి సమస్య తలెత్తుతుందని, ప్రతి మూడు వేల మంది శిశువుల్లో ఒకరికి మాత్రమే ఇలా జరుగుతుందన్నారు. శస్త్రచికిత్స అనంతరం హెల్మెట్ థెరపీ ముఖ్యమని, సుమారు 12–15 నెలల పాటు రోజూ 22–23 గంటలు శిశువు ప్రత్యేక హెల్మెట్ ధరించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం శిశువు పూర్తి ఆరోగ్యంతో ఉందన్నారు.

జెడ్సీకి కార్పొరేటర్ల వినతులు


జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్లు

నాగోలు: వివిధ డివిజన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కార్పొరేటర్లు నాయికోటి పవన్‌కుమార్, కొప్పుల నరసింహారెడ్డి, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మంగళవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని కాలనీల్లో రోడ్లన్నీ పాడైపోయాయని సీసీ రోడ్లను మంజూరు చేయాలని పవన్‌కుమార్ కోరారు. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు లేకపోవడంతో దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వీధి దీపాల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు.

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వీధిదీపాలు లేక రాత్రివేళ రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అలాగే కాలనీల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు హరినాథ్‌రెడ్డి, బద్దం రాంరెడ్డి, సాయికిరణ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడతాం



వనస్థలిపురం: పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పెన్షనర్స్ జేఏసీ, అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం వనస్థలిపురంలోని వాసవి కాన్ఫరెన్స్‌హాల్లో తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ పెన్షనర్ల దినోత్సవంలో పలువురు మాట్లాడారు. ఎంప్లాయీస్ హెల్త్ కార్డు సాధించుకోవడానికి, డీఏ, పీఆర్సీ అమలుకు జేఏసీ ఆధ్వర్యంలో కృషి చేయాలని కోరారు. త్వరలోనే ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకుని సమస్యల పరిష్కారం దిశగా పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మసున మోహన్ నారాయణ, ప్రధాన కార్యదర్శి సరికొండ నరసరాజు, మారం జగదీష్, ఎస్.ఎం.హుస్సేని, ఏలూరి శ్రీనివాస్‌రావు, సత్యనారాయణ, వసుంధర పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ


అయ్యప్ప పల్లకి సేవలో భక్తులు


అన్నదాన కార్యక్రమంలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

మలక్‌పేట: గడ్డిఅన్నారం హనుమాన్ మందిర్‌లో లక్ష్మణ్ గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్ప మహాపడి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప నామ స్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి పల్లకి సేవ వైభవోపేతంగా నిర్వహించారు. ఎల్లెందుల కుటుంబ సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

మాలధారులకు అన్నదానం

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి సాహెబ్‌నగర్ త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అ య్యప్ప స్వామి మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. పూజలో పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని స్వాములకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ మాజీ చైర్మన్ కొత్త శ్రీధర్‌గౌడ్, నాయకులు సురేష్‌గౌడ్, మదాసు ఉమేష్, దాస్‌గౌడ్, రాంబాబు, శ్రీకాంత్‌గౌడ్, శ్రవణ్‌గౌడ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇళ్ల సర్వే.. దరఖాస్తుదారుల్లో టెన్షన్



చాదర్‌ఘాట్: ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకున్న వారిలో టెన్షన్ మొదలైంది. మలక్‌పేట నియోజకవర్గంలో మొత్తం 29060 దరఖాస్తులు రాగా, 3500 మందికి మంజూరైట్లు అధికారులు తెలిపారు. అన్ని డివిజన్లలో సర్వే మొదలైందని అధికారులు ఫోన్ నంబర్ల ఆధారంగా ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని డీసీ వెల్లడించారు. అయితే.. అర్హులను ఎలా ఎంపిక చేస్తారనేది ఇంకా స్పష్టత లేదని అధికారులు తెలపడంతో దరఖాస్తుదారుల్లో టెన్షన్ మొదలై పైరవికారుల చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం.

ప్రతిఘటిస్తే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా?

లగచర్ల ఘటనపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు


ఎన్టీఆర్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చంపాపేట: తమ సొంత భూములను సంరక్షించుకునేందుకు ప్రతిఘటించిన లగచర్ల గిరిజన రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి హింసించడం పద్ధతి కాదని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు రాము ఆగ్రహం వ్యక్తం చేశాడు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం లగచర్ల ఘటనకు నిరసనగా చంపాపేట చౌరస్తాలోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి లగచర్ల గిరిజన రైతులను విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో ప్రస్తుత పాలకులు అప్రజాస్వామిక పద్ధతిలో వ్యవహరిస్తున్నారని ఈ విధానాన్ని మార్చుకోకపోతే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, నాగభూషణం, ధర్వేష్, హబీబ్, శ్రీను, రాజీ పాల్గొన్నారు.

లగచర్ల రైతులను విడుదల చేయాలి..

దిల్‌సుఖ్‌నగర్: అక్రమంగా అరెస్టు చేసిన లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్ డిమా ండ్ చేశారు. లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని మంగళవారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు జీవనాధారమైన భూమిని బలవంతంగా లాక్కునేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఓ సారి ఫార్మా విలేజ్ అని.. మరోసారి ఇండస్ట్రియల్ కారిడార్‌లని మాయమాటలు చెబుతూ భూములను సీఎం తన అల్లుడికి అప్పజెప్పేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తమ జీవన ఆధారమైన భూమిని లాక్కోవద్దని 10 నెలలుగా విజ్ఞప్తి చేసిన పట్టించుకోకుండా నిరంకుశంగా పాశవికంగా రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాలు చేస్తుందన్నారు. రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి రైతన్న చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ అమానవీయ అణచివేత విధానాలకు నిరసనగా అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి,కొండ్ర శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్, శ్యామ్ గుప్తా, రమేష్ కురుమ, ముచ్చింతల జగన్, శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

నేడు రైతుబజార్‌కు సెలవు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ రైతు బజార్‌కు బుధవారం(నేడు) సెలవు ఉంటుందని ఈఓ స్రవంతి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతినెల మూడవ బుధవారం రైతుబజార్‌కు సెలవు ఉంటుందన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


దయానంద్ గుప్తాను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

నాగోలు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా అన్నారు. కొత్తపేట యువ చైతన్య యువజన సంఘం భవనం వద్ద ఎమ్మెల్సీ నిధులతో వేసిన బోరుకు అమర్చిన మోటార్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాలనీలలోని కమ్యూనిటీ హాళ్లు, పార్కుల ఏర్పాటు, పలు ప్రాంతాల్లో బోర్లు వేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌గుప్తా, సత్యనారాయణ, బాబు, రమేష్, సురేష్, శ్రీనివాస్, కంఠంబాబు, కంఠం మహేందర్ పాల్గొన్నారు.

నియామకం


నాగరాజును సన్మానిస్తున్న సహదేవ్‌యాదవ్

చంచల్‌గూడ: కేంద్ర సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడిగా కుర్మగూడ డివిజన్ భరత్‌నగర్‌కు చెందిన నాగరాజు నియమితులయ్యారు. మంగళవారం ఆయన బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సహదేవ్‌యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ కోసం కృష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నిరంజన్ యాదవ్, ఉగాది మహేష్, వెంకట్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, ఎస్. నాగరాజు, యోగి పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో గుర్తు తెలియని ఇద్దరి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తులు

హస్తినాపురం: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ వివరాల ప్రకారం.. నాగార్జున సాగర్ రోడ్డులోని స్వామి నారాయణకాలనీలో మంగళవారం 80 సంవత్సరాల వృద్ధుడు మృతి చెందినట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

సచివాలయనగర్‌కాలనీలో..

సచివాలయనగర్‌కాలనీ మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుల బంధువులు ఎవరైనా ఉంటే వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు


సైలెన్సర్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

నాగోలు: నిబంధనలు ఉల్లంఘించి బైక్ సైలెన్సర్లను మార్చి పెద్ద పెద్ద శబ్దాలతో బైక్‌లు నడుపుతున్న పలువురికి ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించి, సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్‌లోని విజయవాడ జాతీయ రహదారిపై బుల్లెట్‌లకు సైలెన్సర్లు మార్చి ఇతర వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్న రెండు బుల్లెట్ బైక్‌లను స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే వాటిని తీయించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమం అదనపు ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సై రవికుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు నాగోలు విద్యార్థులు



నాగోలు: ప్రోకబడ్డీ జూనియర్స్ జాతీయస్థాయి పోటీలలో పాల్గొనేందుకు నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం పుణెకు బయలుదేరారు. విమానాశ్రయానికి బయలుదేరే ముందు కోచ్ శంకర్‌నాయక్‌తో పాటు విద్యార్థులను ఉపాధ్యాయుల బృందం, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కందికంటి కన్నాగౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, ఎస్ఎంసీ సభ్యులు జిల్కాపల్లి శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్ ఆజాద్ అభినందనలు తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తా


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నాగోలు: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఒక డీఏ ఇచ్చిందని, మిగతా వాటి గురించి డిమాండ్ చేయమనే షరతుపై 204 ఉద్యోగ సంఘాల హామీ ఇచ్చిన ప్రకారమే డీఏ మంజూరు చేసిందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం నాగోలు శాఖ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నాగోలు కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో నిర్వహించిన పెన్షనర్స్ డేలో ఆయన పాల్గొని మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, ప్రతాపరెడ్డి, అశోక్‌కుమార్ రావు, ప్రభాకర్‌రెడ్డి, అశోక్, జగన్నాథం, భాస్కర్ రావు, కోటిరెడ్డి, సుబ్బారావు, కృష్ణమూర్తి, లాలయ్యగౌడ్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ శైలజ, నాయకులు

మహేశ్వరం: యువత చదువులో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీడీఓ శైలజ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గడికోట మైదానంలో సీఎం కప్ క్రీడాపోటీలను ప్రారంభించి, గెలుపొందిన విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. అంతకుముందు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించి, పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ కస్నానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వత్తుల రఘుపతి, మల్లేశ్‌యాదవ్, సాంబయ్య, ప్రవీణ్, రాఘవేందర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సందడిగా సెమీ క్రిస్మస్ సంబరాలు


చిన్నారులకు కేక్ తినిపిస్తున్న పాస్టర్ సాలోమన్ జోబ్స్

మలక్‌పేట: మలక్‌పేటలోని షాలోం టెంపుల్‌లో సెమీ క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. చర్చి వ్యవస్థాపకులు, పాస్టర్, బిషప్ డాక్టర్ పి.సాలోమన్ జోబ్స్ యేసుక్రీస్తు జననంపై సందేశమిచ్చారు. శాంతాక్లాజ్ వేషధారణలో పిల్లలు సందడి చేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో పాస్టర్లు సిలాస్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

చర్చిల వద్ద పరిశుభ్రంగా ఉంచాలి


పనులు పరిశీలిస్తున కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: డివిజన్‌లోని చర్చిల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మూసారంబాగ్ డివిజన్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి ఆదేశించారు. మంగళవారం క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి వద్ద చేపట్టిన పారిశుద్ధ్య పనులు ఆమె పరిశీలించారు. పేరుకుపోయిన మట్టికుప్పలు, వ్యర్థాలు, చెత్తను సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సుభాష్, రాంకీ ఇన్‌చార్జి కళ్యాణ్, నాయకులు సందీప్, ప్రభు, సంతోష్, ఉమేష్ ఉన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యం


నియామక పత్రాన్ని అందజేస్తున్న అజయ్ కార్తీక్

చంపాపేట: రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యా సంస్థల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యమని రాష్ట్ర ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు అజయ్ కార్తీక్ అన్నారు. మంగళవారం చంపాపేటలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లా టీపీయూఎస్ కార్యవర్గ అధ్యక్షుడిగా వైవీరావు, ఉపాధ్యక్షుడిగా భీమ్లా రాథోడ్, కార్యదర్శిగా శంకర్, సభ్యులుగా అనిత, జమీల్‌ఖాన్, విజయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: వనస్థలిపురం రైతుబజార్‌లో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ.15, వంకాయ రూ. 30, బెండ రూ. 45, పచ్చిమిర్చి రూ. 28, కాకర రూ. 38, బీర రూ. 58, క్యాబేజి రూ. 19, ఫ్రెంచిబీన్స్ రూ. 48, క్యారట్ రూ. 35, దొండ రూ. 35–45, చిక్కుడు రూ. 50, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 40, క్యాప్సికం రూ. 60, ఆలు రూ. 28, దోస రూ. 23, సొరకాయ రూ. 11, పొట్లకాయ రూ. 18, ఉల్లిగడ్డ రూ. 44, చామగడ్డ రూ. 35. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్ బీష్మనగర్ కాలనీలో మంగళవారం మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. నాణ్యతగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బంగారు అనితప్రభాకర్, 20వ డివిజన్ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

మీర్‌పేట: మీర్‌పేట న్యూగాయత్రీనగర్ ఫేజ్–1లో అనుమతి లేకుండా చేపడుతున్న నిర్మాణాన్ని కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. 20వ డివిజన్‌లోని ఖాళీ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసి మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని శ్రీగాయత్రీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో టీపీఎస్ మంజు భార్గవి సిబ్బందితో కలిసి అక్రమ నిర్మాణాన్ని జేసీబీతో కూల్చివేయించారు.

నకిలీ వెబ్‌సైట్ పెట్టి.. నగదు కొట్టేసి

నాగోలు: రిసార్ట్ బుకింగ్ కోసం ఆన్‌లైన్ నగదు చెల్లించిన ఓ విద్యుత్ శాఖ ఉద్యోగి నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులు దండుకున్న ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..ఎల్‌బీనగర్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీలో నివాసముండే సంతోష్‌కుమార్ విద్యుత్ శాఖలో ఏఈగా పని చేస్తున్నాడు. ఈనెల 14న గూగుల్‌లో గోల్కొండ రిసార్ట్‌లో స్పా అనే వెబ్‌సైట్ చూసి రిసార్ట్ బుక్ చేసుకోవడానికి అందులో ఉన్న ఒక నంబర్‌కు ఫోన్ చేయగా అడ్వాన్స్ కింద రూ. 12,250 చెల్లించాలని చెప్పడంతో ఆ డబ్బులు చెల్లించాడు. కాసేపటి తర్వాత మరోసారి ఫోన్ చేసి రూ. 75,500 డిపాజిట్ చెల్లిస్తే తిరిగి చెల్లిస్తామని చెప్పారు. ఆన్‌లైన్‌లో ఉన్న వెబ్‌సైట్ నకిలీదని గ్రహించి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.